ఆత్మ తత్త్వ విచారణ

రచయిత :


శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,

శ్రీకాళహస్తి.

1984 [వెల : రూ. 0-90 పై.

ఆత్మ తత్త్వ విచారణ



శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

దైవప్రార్థన

కరుణామూర్తియగు దేవా!

మా చిత్తము సర్వకాల సర్వావస్థలయందును నీ పాదారవిందములందు లగ్నమై అచంచలమైన భక్తితో కూడియుండునట్లు అనుగ్రహింపుము.

పరమ దయానిధీ!

ప్రాతఃకాలమున నిద్రలేచినది మొదలు మరల పరుండువఱకును మనో వాక్కాయములచే మావలన ఎవరికిని అపకారము కలుగకుండునట్లును ఇతర ప్రాణికోట్లకు ఉపకారము చేయులాగునను సద్బుద్ధిని దయచేయుము.

సచ్చిదానందమూర్తీ! నిర్మలాత్మా!

మా యంతఃకరణమునందు ఎన్నడును ఏ విధమైన దుష్టసంకల్పము గాని, విషయ వాసనగాని, అజ్ఞానవృత్తిగాని జొరబడకుండునట్లు దయతో అనుగ్రహింపుము.

వేదాన్తవేద్యా! అభయస్వరూపా!

మాయందు భక్తి జ్ఞాన వైరాగ్య బీజములంకురించి శీఘ్రముగ ప్రవృద్ధము లగునట్లు ఆశీర్వదింపుము. మఱియు ఈ జన్మమునందే కడతేరి నీసాన్నిధ్యమున కేతెంచుటకు కావలసిన శక్తి సామర్థ్యములను కరుణతో నొసంగుము.

దేవా!

నీవు భక్తవత్సలుడవు. దీనులపాలిటి కల్పవృక్షస్వరూపుడవు. నీవు తప్ప మాకింకెవరు దిక్కు? నిన్ను ఆశ్రయించితిమి. అసత్తునుండి సత్తునకు గొని పొమ్ము. తమస్సునుండి జ్యోతిలోనికి తీసుకొనిపొమ్ము. మృత్యువునుండి అమృతత్వమును పొందింపజేయుము. ఇదే మా వినతి. అనుగ్రహించుము. నీ దరిజేర్చుకొనుము.

పాహిమాం, పాహిమాం, పాహిమాం పాహి.

ఆత్మ తత్త్వ విచారణ

రచయిత :

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

శ్రీ శుకబ్రహ్మాశ్రమము

శ్రీ కాళహస్తి

2004

1997 వరకు 10000 ప్రతులు

2004 సం॥ 2000 ప్రతులు

ప్రతులకు :

మేనేజరు,

శ్రీ శుకబ్రహ్మాశ్రమము

శ్రీ శుకబ్రహ్మాశ్రమము పోస్టు

శ్రీ కాళహస్తి-517 640, చిత్తూరు జిల్లా, (ఆం.ప్ర)

ఫోన్ : 08578-222239, 222547

డి. టి. పి. :

శ్రీ అసంగానంద గ్రాఫిక్స్, శ్రీవ్యాసాశ్రమము

ఫోన్ : 08578-287528

ముద్రణ :

శ్రీ పారాశర్య ప్రెస్, శ్రీ వ్యాసాశ్రమము.

ఆత్మ తత్త్వ విచారణ

ఏది వేదముయొక్క సారమై యలరుచున్నదో, సమస్త చరాచర ప్రాణికోట్లును ఏ యానందస్వరూపమును పొందదలంచుచున్నవో, ఎద్దాని ప్రాప్తికై జీవులు భిన్నమార్గముల ననుసరించుచున్నారో అట్టి ధ్యేయాకారమగు పరబ్రహ్మమే ఆత్మ. సర్వవ్యాపకమై, సర్వజీవు లందును సాక్షిరూపమును వెలుంగుచు, ప్రపంచమునకంతకును ఆధార భూతమై యొప్పుచు, జగత్తు అంతయు నశించినను తాను మాత్రము నశింపక జన్మజరామరణాది క్లేశములచేగాని, పదార్థముల యొక్క వికారములచేగాని యంటబడక విశుద్ధమై, ఇంద్రియాతీతమై బుద్ధ్యాది సంఘాతమునంతయును గూడ ప్రకాశింపచేయుచు నెయ్యది వెలయు చున్నదో, అదియే ఆత్మ. వ్యాస వసిష్ఠాది మహామునీంద్రులు విహరించు స్థాన మదియే, సనకాది మహర్షులు సంచరించు క్షేత్రమయ్యదియే, జీవన్ముక్తులగు యోగీశ్వరులందఱును క్రీడించు దివ్య ఆనందమయరంగ మదియే, ఆ క్షేత్రము బుద్ధికి ఆవలనున్నది కావున మనోబుద్ధులకు వశులైనవారికి, ఇంద్రియములను జయింపనివారికి అద్దాని తత్త్వము బోధపడనేరదు.

లౌకిక విద్య లెన్ని గడించినను చిత్తశుద్ధి లేనిచో ఆత్మతత్త్వము లేశమైనను అనుభూతము కాదు. ఎట్టి మహాపండితుడైనను నేత్రము లేనిచో వస్తువులను జూడగల్గునా? సకల శాస్త్రపారీణుడైనను, విద్యాదురంధరుడైనను నిద్రబోవుచో జాగ్రత్ప్రపంచవిషయము లాతనికి గోచరించునా? సామాన్యుడైనను నేత్రములుండినచో చూడగల్గునట్లును, మేలుకొనినచో సమస్త వస్తుజాలమును గాంచగలిగి యితరులను గూడ

ప్రబుద్ధులుగ జేయగలుగునట్లును, ఈ ఆత్మవిద్యను గూర్చియు నట్లే యెఱుంగవలెను.

పశ్యన్నపి ప్రస్ఖలతి శృణ్వన్నపి న బుధ్యతే,
పఠన్నపి న జానాతి దేవమాయావిమోహిత:

"చిత్తశుద్ధి గలుగక పూర్వము జనులు మాయావృతులై యున్న కారణమున అట్టివారు పరమార్థతత్త్వమును చూచినను చూడకయే యున్నారు, వినినను తెలియజాలకయే యున్నారు, చదివినను అర్థము చేసికొనజాలకయేయున్నారు" అని విష్ణుభగవానుడు గరుత్మంతున కెఱింగించెను. ఇదియే తక్కిన విద్యలకును ఈ ఆత్మవిద్యకును గల భేదము. కనుకనే అనేకులలో నెవడో యొకడు మాత్రమే ఈ విద్యను గూర్చి ప్రయత్నించుటయు, అట్లు ప్రయత్నించిన యనేకులలో నెవడో యొకడు మాత్రమే సఫలుడగుటయు సంభవించుచున్నది. మఱియు పరిపూర్ణస్థితినిబొంది ఆత్మవస్తువును కరతలామలకముగ నెఱింగిన జ్ఞానులు లోకమున బహుకొద్దిమంది మాత్రమే యుండుటకును నిదియే కారణము.

దృశ్యవాసనలన్నియు సంపూర్ణముగ నశించుటచేతను, సంకల్ప వికల్పములన్నియు ఉడిగి మనస్సు ధ్యేయాకారమున సంలగ్నమగుట చేతను, భ్రమరకీటన్యాయమువలె ఆత్మతో తదాకారాకారితమగుట చేతను దప్ప మఱిదేనిచేతను ఈ ప్రబలమగు మాయ నశింపదు. తక్కిన యోగములు, ధ్యానములు, పూజలు, జపములు యివన్నియు అంతఃకరణమునందలి మాలిన్యమును తొలగించివైచి క్షేత్రమును

శుద్ధము చేయును. అట్టి శుద్ధాంతఃకరణమున ఆత్మ ప్రతిబింబించును. అనాత్మభూతములగు దృశ్యవృత్తులన్నియు తొలగిననే ఆత్మస్థితి ఘటిల్లును. అపుడే ఆత్మనిరావరణమై భాసిల్లును.

నిజముగ విచారించినచో ఆత్మయొక్క ఆవరణము తొలగించుటయే మనపనిగాని, లేని ఆత్మవస్తువును క్రొత్తగా పొందుటగాదు. శంకరులు వచించినది చూడుడు----

ఆత్మాతు సతతం ప్రాప్తోప్యప్రాప్తవదవిద్యయా
తన్నాశే ప్రాప్తవద్భాతి స్వకంఠాభరణం యథా

అనగా, ఆత్మ ఎల్లప్పుడును జీవులకు సంప్రాప్తించియే యున్నది. కాని అవిద్యచే అయ్యది లేనిచందమున వర్తించుచున్నది. ఆ అవిద్య నశించినవెంటనే మఱచిన నిజకంఠాభరణమునువలె తిరిగి దానిని జీవుడు పొందుచున్నాడు. కాబట్టి జీవులందఱును యథార్థముగ ఆత్మ స్వరూపులే. భ్రమచే తాము బద్ధులమని, అజ్ఞానులమని తలంచుచున్నారు. ఇయ్యది అతీతబోధ. ఇదియే పరమసత్యము. రజ్జువునకు ఏకాలమందును వికారములేదు. సర్పభ్రమ కలుగకమునుపును, కలుగు కాలమునను, భ్రమనివారణానంతరమును గూడ అయ్యది ఒకేవిధమున నున్నది. ఘటమున్నప్పుడును, లేనప్పుడును అందలిజలము చలించుచున్నపుడును, నిశ్చలముగ నున్నపుడునుగూడ సూర్యుడు ఒకే విధముగ ఎల్లకాలములందును ప్రకాశించుచున్నాడు. అదేరీతిగ మార్పు అంతయు చిత్తమునకు కలుగుచుండ ఆత్మస్వరూపుడగ జీవుడు అజ్ఞాన కాలమున ఆ మార్పు తనపై నారోపించుకొని ఆ యుపాధితో

తాదాత్మ్యమొంది దుఃఖితుడగుచున్నాడు. ఎట్లనగా కదలుచున్నది రైలుబండి, కాని అందున్న బాలుడు చెట్లు కదలుచున్నవని తలంచు చున్నాడు. తిరుగుచున్నది భూమి, కాని అసత్యము తెలియనివాడు సూర్యుడే పరిభ్రమించుచున్నట్లు భావించుచున్నాడు.

"దృశ్యతేఽభ్రేషు ధావత్సు ధావన్నివ యథా శశీ"

అనగా పరుగిడుచున్నవి మేఘములు, కాని అవివేకి చంద్రుడు పరుగిడుచున్నట్లు తలంచుచున్నాడు. వెయ్యేల- త్రివిధ శరీరములతోటి తాదాత్మ్యమే జీవునకు బంధహేతువు. దీనినిబట్టి యథార్థముగ ఈ జన్మపరంపరలు, సుఖదుఃఖాది ద్వంద్వములు అన్నియు అంతఃకరణము నకే గాని ఆత్మకు కావని స్పష్టమగుచున్నది. ఆత్మ సదా నిర్వికారమై, ఏకరసమైయే యొప్పు చున్నది.

మనస్సునకు ఈవలనుండి చూచిన శరీరము, జగత్తు, బంధము, మున్నగునవియన్నియు గోచరించును. అట్లు మనస్సున కీవల నున్నంత వఱకును జీవుడు సంసారచక్రపరిభ్రమణమునుండి తప్పించుకొన జాలక, అనేక జన్మ పరంపరాది దుఃఖముల ననుభవింపవలసినదే. దాని నివారించుట కెవరికిని శక్తిలేదు. ప్రకృతియొక్క అప్రతిహతమైన నియమమది. అనగా, దృశ్యవాసనలు, సంస్కారములుండునంత వఱకును, లింగశరీరమున్ను ఉండియే తీరును గావున నపుడు జన్మాది దుఃఖములు కలుగుచునే యుండును. ఎపుడు మనస్సును దాటి ఆవలకు పోదుమో, అపుడే జగత్తుగాని, దేహముగాని, యేవియునుండవు. ఒకే పరమాత్మచైతన్యము తానై వెలుగుచుండును. స్వప్నమునుండి

మేల్కాంచిన, స్వప్నజగత్తు అసత్యమగునట్లు మనస్సును దాటినచో మనఃకార్యమగు జగత్తున్ను అసత్యమై, ఒకే సద్వస్తువు ప్రత్యక్షము కాగలదు. అపుడు రెండవ వస్తువే యుండదు. ఆ యేకమగుసద్వస్తువే బ్రహ్మము; అదియే ఆత్మ.

అట్టి ఆత్మయొక్క స్వరూపమేమియో ఒకింత యోచించెదము. అది సాంతమా, అనంతమా? సాకారమా, నిరాకారమా? క్షణికమా, శాశ్వతమా? ఈ మున్నగువిషయములు విచారణీయములు, జాగ్రతగ ఏకాగ్రబుద్ధితో పరిశీలించిన ప్రతివానికి తనలో ఏదోయొకవస్తువు ఎల్ల కాలములందును సమముగ ఏమార్పును లేక యున్నట్లు గోచరము కాగలదు. అది ‘నేను’ ‘నేను’ అని స్ఫురించునదియే. అదియే ఆత్మ. బాల్యకాలమందు ఏ ‘నేను’ అనునది కలదో, యౌవనకాలమందును, వృద్ధాప్యమందును ఆ ‘నేను’ కలదు. దేహమే పరిణామమొందుచున్నది. కాని ఆ ‘నేను’ అనునది ఎపుడును, అన్నిదశలందును సమానముగనే యున్నది. అట్లే భూత భవిష్యద్వర్తమాన కాలములందును, జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలందును ఆ ‘నేను’ నిర్వికారమై, సమముగ వర్తించుచున్నది. ఏలయనగా, పూర్వమున్న ‘నేను’, ఇప్పుడున్న ‘నేను’ ఒకటి కానిచో పూర్వము చూచిన వస్తువు యొక్క స్మృతి యిపుడు కలుగనేరదు. అదేరీతిగా, ‘నేను స్వప్నమును గాంచితిని’ నేను హాయిగ నిదురించితిని’ అను ప్రత్యగభిజ్ఞ జాగ్రతునందు కలుగుటవలన జాగ్రత్స్వప్నసుషుప్తులను మూటియందును ఒకే ‘నేను’ అనువర్తించియున్నదను సత్యమును అన్వయ వ్యతిరేకములద్వారా మనము స్పష్టీకరింపగలుగుచున్నాము. దీనిని బట్టి ఆత్మ (‘నేను’ అనునది) నిర్వికారమని ఋజువైనది. ఏ

వస్తువు నిర్వికారమో అది తప్పక అనంతమై యుండవలెను. ఈ విషయమును వైజ్ఞానిక శాస్త్రరీత్యా యిపుడు తేల్చుటకు యత్నించెదము.

ప్రపంచములో నున్న సమస్త పదార్థములును ఆకారముతో గూడినవే, అనగా అనేక అణువులయొక్క సంఘాతములే అయి యున్నవి. ఆ అణువులు స్థూలపంచభూతమయములు అయినను, లేక సూక్ష్మపంచభూతమయములు అయినను సరియే. కాబట్టి ఏదో యొక సమయమున ఆ యణువులు తమ కారణరూపమున లీన మొందవలసియే యుండును. అనగా తమ యాకృతి గోల్పోవును. లేక వికారవంతములగును. అట్లు గాక నిర్వికారముగ నున్నచో, ఆ వస్తువు అణువుల సంఘాతము కాక యుండవలెను.

అణువుల సంఘాతము కానిది ఆకారవర్జితమై, అత్యంత సూక్ష్మమైయుండును. ఏది ఆకారవర్జితమో, అత్యంత సూక్ష్మమో అయ్యది తప్పక అనంతమై పరగవలయును. దీనినిబట్టి సర్వావస్థ లందును నిర్వికారమై చెన్నొందు ఆత్మ అనంతమనియే స్పష్టమగు చున్నది.

ప్రతివారిలోను ఈ ఆత్మ ('నేను') కలదు. పై నిర్వచనమును బట్టి అందరిలోను అది అనంతమైయే యుండవలెను. అయితే అనంత మైనది ఒకటే యుండును గాని రెండు అనంతములుగాని, అనేక అనంతములుగాని యెప్పటికిని సంభవింపవు. అట్లు సంభవించుచో అది అనంతమనియే చెప్పబడదు; సాంతమే యగును. దీనినిబట్టి అందఱి ఆత్మయు ఒకటే యని తేలినది. ఇంతవరకు విచారించిన దానిని బట్టి ఆత్మ ఏకమని, సత్యమని, నిర్వికారమని అనంతమని నిశ్చయించినాము.

అయితే ఇక జగత్తు మాట యేమి? అది ఎక్కడనుండి వచ్చినది? ఆత్మ, జగత్తు రెండును ఎట్లు సత్యము కాగలవు? ఒకే రాజ్యమునకు ఇద్దఱు చక్రవర్తు లెట్లుండగలరు? కావున నిదియేమియో విచారించెదము- పాశ్చాత్య సిద్ధాంతమునందు జగత్స్థితిని గూర్చిన రెండు వాదములు కలవు-- (1) విజ్ఞానవాదము (Idealism) (2) భౌతికవాదము (Realism or meterialism) అని, మొదటి పక్షమువారు జగత్తు కేవలము భావములచే నేర్పడినదనియు, స్థూలముగ కానుపించు ఈ జగద్రూపము సత్యముకాదనియు చెప్పుదురు. ఈ వాక్యము నందు కొంత సత్యము కలదు. గాని అయ్యది పూర్ణ సత్యము కానేరదు. ఏలయనిన భావము లకు ఆధారమేదేని యుండితీరవలెను. భిత్తిలేక చిత్రముండనట్లున్ను, జలములేక తరంగముండనట్లున్ను, ఆధారమేదేని లేనిచో ఆధేయము లగు భావములు నిలువజాలవు. ఆ యాధారమే అనగా అధిష్ఠానమే ఆత్మ. అట్టి ఆత్మయను అధిష్ఠానముపై రజ్జువునందు సర్పమువలె అజ్ఞానముచే కల్పింపబడినది. ఈ జగత్తు పరమార్థ దృష్టిచే ఆత్మకంటె వేఱుగాక వర్తించుచున్నది. అదియే సత్యమని చెప్పుదురు. ఈ సిద్ధాంత మున్ను సరికాదు. ఏలయనగా, ఈ దృశ్యజగత్తు స్వప్నమునగాని, సుషుప్తియందుగాని లేదు. ఏది సత్యమో అది ఎల్లకాలములందును ఉండవలెను. మఱియు సత్యమైన వస్తువు అందఱికిని అన్ని వేళలందును ఒకేవిధముగ గన్పించవలెను. ఈ జగత్తో జంతువుల కొక విధముగను, పక్షులకొక విధముగను, మనుజుల కొకవిధముగను భిన్నభిన్నముగ కానుపించుచున్నది. ఇక మనుజులలో గూడను వారి వారి మనస్తత్త్వము లనుబట్టి కొందరికి ఒకప్పుడు దుఃఖమయముగను, మఱికొందరికి

ఆనందయుక్తముగను గోచర మగుచున్నది, ఈ కానుపించు జగత్తు సత్యముకాదు. అజ్ఞానముచే కల్పింపబడిన దేహేంద్రియ మనోరూప మగు ఉపాధివలన ఆత్మయే యీ జగద్రూపమున దృశ్య మానమగు చున్నదనుటయే పూర్ణసత్యము.

అట్లు గాక ఒకవేళ ఆత్మనుండియే ఈ జగత్తు పుట్టుచున్నదని తలంచుచో అపుడాత్మ వికారవంతమగును, మఱియు దాని అనంతత్వ, నిత్యత్వములకు హానియు కలుగును. కాబట్టి ఆ సిద్ధాంతమున్ను సమ్మతము కాదు. నిజమేమనిన ఆత్మనిర్వికారముగ ఎప్పటియట్లే నిజసచ్చిదానందస్వరూపముతోటి వెలయుచున్నది. మనస్సను అద్దము గుండా జూచువారల కది జగద్రూపమున గోచరించుచున్నది. కావున నామరూపాత్మకమును, క్షణికము నగు ఈ జగత్తువలన ఆత్మయొక్క నిత్యత్వ, అనంతత్వ, నిర్వికారత్వములకు ఏ హానియులేదు.

ఇక ఆత్మ అనంత మను విషయమును మరియొక విధముగా స్పష్టపరచెదము- భూతాకాశము, చిత్తాకాశము, చిదాకాశము అను మూడాకాశములు కలవు. అందు చిదాకాశమే ఆత్మ. భూతాకాశమును మ్రింగునది చిత్తాకాశము, చిత్తాకాశమును మ్రింగునది చిదాకాశము. భూతాకాశము ఎంతో గంభీరమై, విశాలమై, సర్వవ్యాప్తమై, అతిసూక్ష్మమై యుండ ఇక చిదాకాశమెంత మహిమాతిశయము గలిగియుండునో! ఈ విషయమునే యిపుడు వివరముగ తెలిసికొందము- అనేక వేల మైళ్ళ విస్తీర్ణముగల భూఖండములును, మహాసముద్రములును, గొప్ప గొప్ప పర్వతములును గలిగియున్న ఈ భూగోళముయొక్క నిడివి

8 వేలమైళ్ళు. భూమికంటె సూర్యడనేకరెట్లు పెద్దది. దాని నిడివి దాదాపు 8 లక్షలమైళ్ళు ఉండును. అంత పెద్దదైనను 9 కోట్లమైళ్ళ దూరమున నుండుటబట్టి ఆ సూర్యగ్రహము చాలా చిన్నదిగా మనకు కనిపించు చున్నది. సూర్యుడు అగ్నిమయము. అపుడపుడందు ప్రచండ వాయువులు వీచుటచే అగ్నిజ్వాలలు వీచుచుండును. అ విధముగ వీచునట్టి ఒక్కొక్క అగ్నిజిహ్వ యందు మన భూగోళములెన్నియో పట్టును. దీనిచే సూర్యబింబముయొక్క అతివిశాలరూప మొకింత అవగాహన కాగలదు. ఇక నక్షత్రము లే పదార్థములు? ఆకాశము నలంకరించు చిన్నచుక్కలా? కాదు. ఒక్కొక్క నక్షత్రమును సూర్యుని వంటి అతివిశాల పదార్థమే. ఇంతేకాదు ఈ సూర్యునికంటె అనేకరెట్లు పెద్ద వగు నక్షత్రము లనేకములు కలవు. కాని ఈ మన సూర్యునికంటె చాలాదూరమున నుండుటచే అయ్యవి చిన్న చుక్కల పగిది దృగ్గోచర మగుచున్నవి. నక్షత్రము లెంత దూరము నన్నవో యూహించుటకొక మార్గమును జెప్పెద వినుడు:- ప్రకాశముయొక్క వేగము సెకండునకు దాదాపు 160 వేల మైళ్ళు అనగా కనుఱెప్పపాటు కాలములో అది 160 వేలమైళ్ళు పోవునని అర్థము. ఇంత మహావేగముగల ప్రకాశమున్ను నక్షత్రములనుండి బయలుదేరి భూమిని జేరవలెనన్న ఎన్నియో సంవత్సరములకాలము పట్టును. అంతియేకాదు, కొన్నినక్షత్రముల ప్రకాశము భూమినింకను జేరలేదనియే కొందరు ఖగోళశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. ఆహా! ఎంత వైశాల్యము! అటువంటి అసంఖ్య విశాల నక్షత్ర, సూర్య, చంద్ర గ్రహాదులను తన కుక్షి యందుంచుకొనిన యీ భూతాకాశ మెంత విశాలమైనచో ఒక్కపర్యాయ మూహింపుడు!

ఇట్టి యనంతాకాశము చిత్తమున కన్యముగిలేదు. ఏలయనగా సంకల్పము వలననే ఈ జగత్తు ఉద్భూతమగుచున్నది. ఆ చిత్తమో,

"విష్టభ్యాహమిదం కృత్స్న మేకాంశేన స్థితోజగత్"

అనునట్లు ఆత్మయందెచటనో కల్పితమైయున్నది. ఇక నట్టి ఆత్మ యెంత విశాలమైనదో, అనంతమైనదో యూహింపుడు! ఏ సచ్చిదాకాశమున చిత్తాది సూక్ష్మప్రపంచము, స్థూలరూపములగు ఈ అనంత కోటి బ్రహ్మాండములు ఉదయించి, స్థితి గలిగి, తుదకు లయించు చున్నవో అట్టి పరమాత్మ అనంత మని వేఱుగ చెప్పవలయునా!

ఆత్మ స్వప్రకాశరూపముగలది, మఱియు దేనిచేతను అయ్యది ప్రకాశింపబడదు. అదియే సమస్త దృశ్యపదార్థములను ప్రకాశింపజేయు చున్నది. ఈ ప్రకాశమానుడగు సూర్యునకు గూడ స్వతఃసత్తలేదు. ఆత్మసత్తచేతనే యాతడు ప్రకాశించుచున్నాడు. కాబట్టి సూర్యుడా యాత్మను ప్రకాశింపజేయజాలడు. ఘటము దీపమును ప్రకాశింపచేయ గల్గునా? కావుననే శ్రుతులు--

"తమేవభాన్తమనుభాతి సర్వం,
తస్యభాసా సర్వమిదం విభాతి"

అని పేర్కొనినవి. అనగా ఆ యాత్మ యుండుటచేతనే యీ సమస్త పదార్థములును సత్తగలిగియున్నవి కాని, లేకున్న వానికి ఉనికియే సంభవింపదని భావము. ఘటమునుండి మృత్తికను తీసివైచిన ఇక మిగులున దేది? తరంగమునుండి జలమును తీసివైచిన ఇక తరంగ

మెచట? కాబట్టి ప్రతి పదార్థమునందును గల అస్తి, భాతి, ప్రియ, నామరూపములను అయిదు అంశములలో మొదటి మూడును అనగా అస్తి, భాతి, ప్రియములు (లేక సత్, చిత్, ఆనందములు) బ్రహ్మ రూపము లగుటచే సత్యములును, తక్కిన నామరూపములు రెండును జగద్రూపములగుటచే మిథ్యయు అయియున్నవి. చిత్ అనగా ప్రజ్ఞానము, తెలివి.

శ్లో॥ యేనేక్షతే శృణోతీదం జిఘ్రతి వ్యాకరోతి చ ।
స్వాద్వస్వాదూ విజానాతి తత్ప్రజ్ఞానముదీరితమ్ ॥

అని యీ ప్రకారముగ ప్రజ్ఞానము యొక్క స్వరూపము ఉపనిషత్తులయందు నిర్వచింపబడినది. అనగా, దేనిచే ప్రాణి చూచుచున్నాడో, వినుచున్నాడో, మూర్కొనుచున్నాడో, వచించుచున్నాడో, రుచులను తెలిసికొనుచున్నాడో, అట్టి తెలివియే ప్రజ్ఞానము, లేక ఆత్మ. అయితే వినునది, చేయునది, చూచునది ఆత్మ కాదు. ఏ తెలివి (ప్రజ్ఞానము) చే వినుచున్నామో, చేయుచున్నామో, చూచుచున్నామో అది ఆత్మ. ఆట్లు కాక ఆత్మ చేయునది, చూచునది యగుచో త్రిపుటి (జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము) యందంతర్గతమై వికారయుక్తమగును. ఆత్మకు వికారము సమ్మతము కాదు. అయ్యది ఆత్రిపుటికి విలక్షణమై, దాని కాధార భూతమై, అద్దానిని ప్రకాశింపజేయుచు చిద్రూపమై వెలయుచున్నదే యగును.

ఈ ఆత్మ దేహముకాదు, ప్రాణముకాదు, ఇంద్రియములు కాదు, మనోబుద్ధ్యహంకారములు కాదు. వీనియన్నిటికిని పరమై, సాక్షి భూతమై

యది ప్రకాశించుచున్నది. ఏలయనగా ఆ దేహాదులన్నియు (జాయతే, వర్ధతే-ఇత్యాది) షడ్వికారములతో కూడినవి. కావున నశ్వరములు, ఆత్మయో నాశరహితము. అది వాని వికారములచే నంటబడక, వాని చేష్టలన్నింటిని సాక్షిరూపమున గాంచుచున్నది.

శ్లో॥ దేహేంద్రియ మనోబుద్ధిప్రకృతిభ్యో విలక్షణమ్ ।
తద్వృత్తిసాక్షిణం విద్యాదాత్మానం రాజవత్సదా ॥

అని శ్రీ శంకరులు వచించినలాగున, రాజు తన యాజ్ఞచే మంత్రులు మున్నగువారు గావించు వ్యవహారములను సాక్షిభూతముగ వీక్షించునట్లు దేహేంద్రియాదులు ఆత్మసన్నిధానబలముచే వ్యవహరించు చుండ, వానికి సంబంధింపక ఆ యాత్మ సాక్షిగా జూచుచున్నది. కాబట్టి ఈ దృశ్యమంతయు ఎన్ని వికారములు పొందుచున్నను ఆత్మ నిర్వికారమై, అవ్యయమై, అచంచలమై నాటక మందలి దీపమువలె సదా ఏకరసముగ భాసిల్లుచున్నది. నాటకమందనేక పాత్రధారులు వచ్చి పోయినను దీపము వారలనందఱిని ప్రకాశింపజేయుచు వారల సుఖ దుఃఖములచే నంటబడక వారున్నను, లేకున్నను ఏకరీతి వెలుగుచుండును గదా! అట్లే ఈ ఆత్మజ్యోతియును.

ఆత్మయొక్క స్వరూప తత్త్వవిచారణములందు కపిలుని సాంఖ్యము చాలవఱకు ఉపకరించును. అది యెట్లో యిపుడు విచా రించెదము. ఈ దృశ్యమానమగు పదార్థములన్నియు నిరంతరము పరిణామమొందుచునేయున్నవి. సూక్ష్మాణువు లహర్నిశము ఆయా పదార్థములనుండి లేచి అన్యపదార్థములందు ప్రవేశించుచు విశ్రాంతి

లేక నిరంతరము సంచరించుచునే యున్నవి. ప్రాణులు భుజించినది మలాదుల ద్వారా బాహ్యప్రదేశమునకుబోయి యెఱువుగా పరిణమించి మరల యేవృక్షమందో సూక్ష్మరూపమున ప్రవేశించి ఫలాదులగు చున్నది. జలబిందువులు ఆవిరియై మేఘరూపమొందుచున్నవి. ఒకరు వదిలినగాలి మఱియొకరు పీల్చుచుండుటచే ఒకరియందలి అణువులు మఱియొకరియందు ప్రవేశించుచున్నవి. ఇపుడున్న ఈ దేహము ఇంకొక యేడువత్సరములకు సంపూర్ణముగ మారి నూతనాణువులతో గూడినదగుచున్నది. ఆ పాత అణువులన్నియు ఇతర జగత్పదార్థము లందు జొరబడినవని యర్థము, నేడు మన దేహముపైగల అణువు రేపు జంతువునందో లేక వృక్షమందో ప్రవేశింపవచ్చును. లేదా సూర్యాది గోళములందు చేరవచ్చును. ఈ రీతిగ ప్రపంచమున అనవరతము గొప్ప పరిణామము జరుగుచున్నది. మన దేహమందలి పృథ్వ్యంశమునకు, బాహ్యమందలి పృథ్వ్యంశమునకునుప భేదమున్ను లేదు. అట్లే జలాగ్ని వాయూకాశములను గూర్చియు నెఱుఁగవలెను. కాబట్టి మన స్థూలదేహము సమష్టిస్థూలదేహము (విరాట్) యొక్క అంశమే యగును, విరాట్ సాగరమున మన స్థూలదేహమొక తరంగము వంటిది. అనగా మనుష్య పశుపక్షి క్రిమికీటాదుల శరీరములన్నియు ఆవిరాడ్దేహమను సముద్రమున వివిధతరంగములని భావము. కావున వాస్తవముగ జూచిన మనుష్య దేహమునకును, జంతు దేహమునకును, కీటదేహమునకును ఏమియు భేదము లేదు.

అదేరీతిగ వ్యష్టిమనస్సు, సమష్టిమనస్సు (హిరణ్య గర్భుడు) యొక్క ఒకభాగము కాబట్టి మనమనస్సు, జంతువుల మనస్సు,

అన్నియు ఒకే అపంచీకృత భూతసముదాయమందలి వివిధభాగములై యున్నవి. ఇపుడు వ్యష్టిని సమష్టియందైక్యపఱచి, అనగా స్థూలశరీరమును విరాడ్దేహము (విశ్వము) నందును, వ్యష్టి మనస్సును సమష్టి మనస్సు నందును భావనచే లయమొనర్చి వ్యష్టిసమష్టులకు సాక్షియై విలసిల్లు స్వస్వరూపాత్మస్థితియందు నెలకొనియుండుటను లెస్సగ అభ్యసించ వలెను. అత్తఱి కష్టపరంపరలన్నియు పటాపంచలైపోగలవు, సంసార దుఃఖదావానలము పరిపూర్ణముగ శమించి పోగలదు. ఆత్యంతిక భవ దుఃఖోపశమనమునకు ఆత్మతత్త్వ విచారణయే ఏకైక మార్గము. కాబట్టి ముముక్షువులెల్లరు అహర్నిశము తత్త్వవిచారణ గావించుచు నిత్యమై, శుద్ధమై, ముక్తమైనట్టి పరంజ్యోతియగు ఆత్మస్వరూపమును చక్కగ అవగాహనమొనర్చుకొని అట్టి పరతత్త్వమున, స్వస్వరూపమున బాగుగ నిలుకడగలిగి పరమానందమును బడయుదురుగాక!

శ్రీ శుకబ్రహ్మాశ్రమ గ్రంథముల వివరములు

1.	గీతామకరందము (తెలుగు)	రూ. 200-00
2.	GITA MAKARANDA (English)	250-00
3.	గీతామకరందము (కన్నడం)	250-00
4.	గీతామకరందము (తమిళం)	150-00
5.	యోగవాసిష్ఠరత్నాకరము	100-00
6.	రామాయణ రత్నాకరము	100-00
7.	భారత రత్నాకరము	100-00
8.	భాగవత రత్నాకరము	100-00
9.	ఉపనిషద్రత్నాకరము	80-00
10.	గీతోపన్యాసములు	50-00
11.	మోక్షసాధన రహస్యము	50-00
12.	పరమార్థకథలు	60-00
13.	బ్రహ్మచర్య విజయము	50-00
14.	అధ్యాత్మరామాయణము	25-00
15.	ఆత్మానుసంధానము	35-00
16.	బ్రహ్మానంద వైభవము	25-00
17.	భజనలు - కీర్తనలు	30-00
18.	శ్రీ వాసిష్ఠమహారామాయణము	35-00
19.	అమృత బిందువులు	25-00
20.	శ్రీమద్భగవద్గీత (స్థూలాక్షరి)	20-00
21.	నిత్యస్మరణీయము	20-00
22.	శ్రీమద్భగవద్గీత (మూలం)	8-00
23.	వివేకానంద సింహనాదము	30-00
24.	గీతా ముచ్చట్లు	15-00
25.	శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాముల జీవిత చరిత్ర	35-00
26.	యమలోకవార్తలు	10-00
27.	తత్త్వసారము	6-00
28.	మానసబోధ	6-00
29.	పాండవగీత	5-00
30.	ఆధ్యాత్మజడ్జిమెంటు	10-00
31.	ధ్యాన పద్ధతి	5-00
32.	వైరాగ్యసాధన	5-00
33.	దివ్యసూక్తులు	15-00
34.	మట్టిలో మాణిక్యము	5-00
35.	ప్రణవపూజ	4-00
36.	గౌరిపూజావిధానము	4-00